సాక్షి ములుగు

బుధవారం । 13 । డిసెంబర్ । 2023



దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి

దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య తాటికొండ రమేష్ అన్నారు. - 8లో



శాఖల వారీగా వివరాలు అందజేయాలి

మేడారం మహాజాతరకు సంబంధించి శాఖల వారీగా వివరాలను అందజేయాలని పీఓ అంకిత్ అధికారులను ఆదేశించారు. - 8లో

గరిష్టం/కనిష్టం
28.0°/18.0°

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రి సమయంలో చలి తీవ్రత అధికంగా ఉండడంతో పాటు పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఈసారి నవలా పురస్కారాలు లేవు: నవీన్

విద్యారణ్యపురి : నవలా పురస్కారాల ప్రదానం ఈ ఏడాది లేదని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, నవీన్ లిటరరీ ట్రస్ట్ అధ్యక్షుడు అంపశయ్య నవీన్ ఒక ప్రకటనలో తెలిపారు. 2001 నుంచి ప్రతి సంవత్సరం తన పుట్టిన రోజు డిసెంబర్ 24న కొత్తగా నవలలు రాసే వారిని ప్రోత్సహిస్తూ పురస్కారాలు అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా తాను కూడా ఏడాదికి రెండు పుస్తకాలను రాసి ఆవిష్కరిస్తున్నానని తెలిపారు. తన సతీమణి అనసూయ మృతితో ఈ ఏడాది రెండు పుస్తకాలను ఆవిష్కరించడం లేదని, నవలా పురస్కారాలను అందించడం లేదని చెప్పారు. సాహితీవేత్తలు, నవలా రచయితలు, శ్రేయభిలాషులు, అభిమానులు గమనించాలని ఆయన కోరారు. కాగా, తన సతీమణిపై రాసిన పుస్తకాన్ని వచ్చే ఏడాది మేలో ఆవిష్కరించనున్నట్లు అంపశయ్య నవీన్ తెలిపారు.

16న కేయూలో వర్క్‌షాప్



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని కామర్స్ పీజీ అధ్యాపకుల కోసం రీసెర్చ్ అండ్ మెథడాలజీ, రీసెర్చ్ మెథడాలజీ అండ్ రిపోర్టింగ్ రైటింగ్‌పై వర్క్‌షాపును ఈనెల 16న మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం కేయూలో వర్క్‌షాపు పోస్టర్‌ను వీసీ తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాంపస్‌లోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్‌హాల్‌లో జరిగే వర్క్‌షాపునకు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ నర్సింహాచారి, బీఓఎస్ చైర్మన్ ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అడ్జెంట్ ప్రొఫెసర్ పి.కృష్ణమాచార్య, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్, కాంట్రాక్టు అధ్యాపకుడు కటకం ఫణీంద్ర పాల్గొన్నారు.

కార్తీకం ముగిసింది..

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయానికి కార్తీకమాసం ఆదాయం ఈ ఏడాది తగ్గింది. నవంబర్ 14నుంచి ప్రారంభమైన కార్తీక మాసం మంగళవారంతో ముగిసింది. నెల రోజుల పాటు ఆలయాలన్నీ శివనామస్మరణతో మారుమోగాయి. అభిషేకాలు, కాలసర్ప, నవగ్రహ నివారణ పూజలు, సామూహిక సత్యనారాయణ వ్రతాలు, లక్షవత్తులు, ఉసిరి చెట్టు వద్ద ప్రదక్షిణలు, దీపారాధనలతో భక్తులు అధికసంఖ్యలో భక్తిపారవశ్యంలో మునిగారు. గత నెల నుంచి ఈనెల 4వ తేదీ వరకు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భక్తులు అడపాదడపా వచ్చి దర్శనాలు చేసుకున్నారు. ప్రజలతో పాటు నాయకులు అంతా ఎన్నికల హడావుడిలో గడిపారు. ఈ సారి వివిధ పూజలు, లడ్డు ప్రసాదాలు, గదుల అద్దెతో ఆలయానికి రూ.67.10లక్షల ఆదాయం వచ్చింది. గతేడాది కార్తీకమాసంలో రూ.75లక్షల ఆదాయం రాగా ఈసారి 7.90లక్షల ఆదాయం తగ్గిందని ఆలయ అధికారులు తెలిపారు. డిసెంబర్ 30న ఎన్నికలు ముగిసిన తర్వాత కొద్దిగా భక్తులు రావడం, కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో ఉచిత బస్సులు ఏర్పాటు చేయడంతో కూడా మహిళా భక్తులు ఇటీవల అధికంగా వచ్చారు.

విద్యార్థుల అభ్యసన స్థాయిని పెంచాలి



మల్హర్: విద్యార్థుల అభ్యసన స్థాయిని పెంచడానికి ఉపాధ్యాయులు కృషిచేయాలని మోడల్ స్కూల్ డైరెక్టర్ పి.సరోజినీదేవి సూచించారు. మండలంలోని ఎడ్లపల్లి మోడల్ స్కూల్, రుద్రారం, ఎడ్లపల్లి ప్రాథమిక పాఠశాలల్లో మంగళవారం ఎఫ్ఎల్ఎన్ ఉన్నతి, లక్ష్యసాధనలో పర్యవేక్షణ కోసం ఆమె సందర్శించారు. విద్యార్థుల్లో అభ్యసన ఫలితాలు ఏ స్థాయిలో ఉన్నాయో నిర్ధారించేందుకు అమలు తీరును పర్యవేక్షించారు. వాటి సాధనకు ఉపాధ్యాయుడు మార్చుకోవాల్సిన బోధనా విధానాన్ని విద్యార్థులలో ఆశించిన స్థాయి ఫలితాలు రాబట్టడానికి వివిధ బోధన పద్ధతులు అవలంభించాలని తెలిపారు. విద్యార్థుల అభ్యసన స్థాయిలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన స్థాయి, చదవడం, రాయడంలో లోటుపాట్లను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఏఎంఓ లక్ష్మణ్ ఉన్నారు.

కమలాపురంలోని బిల్ట్ ఫ్యాక్టరీ(ఫైల్)



మేడారం మహాజాతర(ఫైల్)



సీతక్క.. ఇటువైపు చూడక్కా..

- మంత్రి రాకకోసం నియోజకవర్గ ప్రజల ఎదురుచూపు
- ఆమె ముందుకు పలు పెండింగ్ సమస్యలు
- 15న ములుగుకు వచ్చే అవకాశం

ములుగు: నూతనంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి పారుదల, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ములుగు ఎమ్మెల్యే డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) రాక కోసం నియోజకవర్గ ప్రజలతో పాటు జిల్లా వాసులు ఎదురు చూస్తున్నారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో 33,700 మెజార్టీతో భారీ విజయాన్ని సాధించిన సీతక్క సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో సముచిత స్థానాన్ని దక్కించుకొని కీలక మంత్రి పదవులను దక్కించుకున్న విషయం తెలిసిందే. దీంతో స్థానిక గిరిజన, గిరిజనేతరులు తమతమ సమస్యలను సీతక్క దృష్టికి తీసుకవెళ్లి పరిష్కరించుకోవాలనే ఆలోచనలో ఉన్నారు. ఇందుకోసం మంత్రి రాకకోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే పలు ప్రజా సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, పార్టీ కీలక నేతలు హైదరాబాద్ దారిపట్టి ప్రతిరోజూ ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మంత్రికి కేటాయించిన గృహానికి క్యూ కడుతున్నారు. తాజాగా మంగళవారం సీతక్క కీలక ప్రకటన చేశారు. తనను కలవడానికి ఆయా సంఘాల నాయకులు, పార్టీ కార్యకర్తలు హైదరాబాద్ రావొద్దని రెండు రోజుల్లో ములుగుకు వస్తున్నట్లుగా తెలిపారు.

మేడారం మహాజాతరకు మంచి రోజులు?

మేడారం మహాజాతరకు గత టీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో 2018లో 80.55కోట్లు, 2022 జాతరలకు రూ.75 కోట్ల చొప్పున శాశ్వత, తాత్కాలిక పనులకు నిధులు కేటాయించారు. చివరి సమయంలో కలెక్టర్ నిధులను సైతం ఖర్చు చేశారు. అయితే ప్రస్తుతం ప్రధాన శాఖలకు మంత్రిగా సీతక్క ఉండడంతో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగనున్న మహాజాతరకు సీఎం రేవంత్‌రెడ్డిని ఒప్పించి కాంగ్రెస్ ప్రభుత్వం తరఫున సీతక్క అధిక నిధులు తీసుకొస్తారనే ఆశాభావాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సోమవారం మంత్రి సీతక్క హైదరాబాద్ నుంచి ఐటీడీఏ అధికారులతో సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేశారు. వచ్చే వారం ఏటూరునాగారంలో శాఖ అధికారులతో మరోమారు సమీక్ష ఏర్పాటు చేయనున్నారు. అధికారులు అందించే నివేదికల ఆధారంగా ప్రతిపాదనలను సిద్ధం చేసి సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి అందించనున్నట్లుగా తెలుస్తోంది. ఈ సారి సుమారు రూ.100 కోట్లకు పైగా నిధులు మంజూరయ్యే అవకాశాలు ఉన్నాయి. గత వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలతో రోడ్లతో పాటు, జంపన్నవాగుపై గతంలో నిర్మించిన మెట్లు, బాతింగ్ ఘాట్స్ భారీగా దెబ్బతిన్నాయి. పరిసర గ్రామాల్లో గతంలో శాశ్వత ప్రాతిపదికన నిర్మించిన మరుగుదొడ్లు పాడయ్యాయి. వీటిని పునరుద్ధరించడానికి అధికంగా నిధుల అవసరం ఉంది. దీనికి తోడు గిరిజన కుంభమేళగా పేరుగాంచిన మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరకు జాతీయ స్థాయి గుర్తింపు లభిస్తుందని పలువురు చర్చించుకుంటున్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో కీలక బాధ్యతలో ఉన్న సీతక్క ఏ మేరకు కేంద్రంతో పోరాడుతారనేది వేచి చూడాల్సిందే.

గోదావరి జలాలు అందే అవకాశం

తలాపున గోదావరి ఉన్నా చాప దూపకు ఏడ్చినట్లుగా మారింది ములుగు నియోజకవర్గ ప్రజల దుస్థితి. దేవాదుల నుంచి రాష్ట్రమంతా గోదావరి జలాలను అందించిన గత ప్రభుత్వం ములుగు ప్రజల గురించి పట్టించుకోలేదు. దేవాదుల నుంచి నర్సంపేట, సిద్దిపేట, సిరిసిల్ల వంటి ప్రాంతాలకు నీళ్లు తరలివెళ్లినా స్థానికులకు మాత్రం అందలేదు. గత ప్రభుత్వ పాలనలో నర్సంపేట ఎమ్మెల్యేగా ఉన్న పెద్ది సుదర్శన్‌రెడ్డి తన నియోజకవర్గానికి నీటిని మళ్లించుకున్నా అప్పుడు ప్రతి పక్షంలో ఉన్న సీతక్క ఏమీ చేయలేక పోయింది. ఆ క్రమంలో బీఆర్ఎస్ పార్టీపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. కానీ నేడు పరిస్థితి మారింది. ప్రస్తుతం సీతక్క కేబినెట్ మంత్రి. ఇప్పటికైనా గోదావరి జలాలు అందుతాయని నియోజకవర్గ ప్రజలు ఆశీస్తున్నారు. రామప్ప నుంచి లక్నవరం వరకు గ్రావిటీ కెనాల్ నిర్మాణం పూర్తిచేసి నిత్యం లక్నవరంలో నీటి నిల్వలు ఉండేలా చేయడంతో పాటు దయ్యాల వాగు మీదుగా జంపన్నవాగుకు నిత్యం నీళ్లు పారేలా చూడడం, వెంకటాపురం(ఎం) మండలంలోని ఇంచెన్‌చెర్వుపల్లి, ములుగు మండలంలోని రంగాయి చెర్వులను ప్రాజెక్టులుగా మార్చడం ద్వారా వేలాది మంది రైతులకు సాగునీరు అందించే అవకాశం ఏర్పడుతుంది. దీనికి తోడు లక్నవరం కాల్వలు, మల్లూరు మధ్యతరహా ప్రాజెక్టు, వెంకటాపురం(కె) మండల పరిధిలోని పాలెం ప్రాజెక్టు కాల్వలను పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది.

బిల్ట్ కార్మికుల్లో ఉత్సాహం

ములుగు నియోజకవర్గంలోని మంగపేట మండలం కమలాపురం ఏపీ రేయాన్స్ ట్రేడ్ కంపెనీ 2014లో మూతపడింది. తదనంతరం కంపెనీ నిర్వహణకు సబ్సిడీ ఇవ్వడానికి అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం రా మెటీరియల్స్‌కు 2015లో రూ. 250 కోట్లు, 2018లో రూ.300 కోట్లకు పైగా కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపింది. సంస్థ ముందుకు రాకపోవడంతో ఫైల్ అక్కడికే ఆగిపోయింది. ఈ క్రమంలో పదుల సంఖ్యలో కార్మికులు బలవన్మరణాలతో పాటు, అనారోగ్య కారణాలతో మృతి చెందారు. వేలాది మంది కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఈ విషయంలో సీతక్క పలుమార్లు పోరాడింది. ప్రస్తుతం సీతక్కకు మంత్రిగా హోదా రావడంతో బిల్ట్ కార్మికుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ నెల 15వ తేదీన జిల్లాకు రానున్న మంత్రి రాక కోసం బిల్ట్ కార్మికులు వేయి కళ్లతో వేచి చూస్తున్నారు. ఇదిలా ఉండగా రేయాన్స్ ఫ్యాక్టరీ యాజమాన్యం మాత్రం ముందుకు వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు.

'తొలిమెట్టు'ను పటిష్టంగా అమలు చేయాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

ములుగు రూరల్: విద్యాశాఖ తరఫున అమలు చేస్తున్న తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయాలని జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు మంగళవారం మండల పరిధిలోని దేవగిరిపట్నం ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, పత్తిపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఆయన మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఉపాధ్యాయులతో తొలిమెట్టు కార్యక్రమంపై చర్చించారు. రికార్డుల నిర్వహణపై తగిన సూచనలు చేశారు. క్షేత్ర స్థాయిలో విద్యార్థులకు తొలిమెట్టు ఫలాలు అందేలా చూడాలన్నారు. ప్రధానోపాధ్యాయులు ప్రతిరోజూ ఒక తరగతిని పరిశీలన చేసి స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో వివరాలను నమోదు చేయాలన్నారు. ఈ నెల చివరి వరకు పదోతరగతి సిలబస్ పూర్తి అయ్యేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రేమలత, ఆయేషాకౌసర్, దహమూద్, అనంతరామ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు క్రీడాపోటీలు

ములుగు రూరల్: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాకేంద్రంలో దివ్యాంగులకు రేపు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రీడాపోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులకు పరుగు పందెం, షాట్‌పుట్, చెస్, క్యారమ్, జావెలిన్ త్రో, వీల్ చైర్, ట్రై సైకిల్ పందెం నిర్వహించనున్నట్లు వివరించారు. ఉదయం 8 గంటలకు కలెక్టర్ ఇలా త్రిపాఠి క్రీడా పోటీలను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థుల హాజరుశాతం పెంచాలి

అదనపు కలెక్టర్ వేణుగోపాల్



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

వెంకటాపురం(కె): పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని అదనపు కలెక్టర్(రెవెన్యూ) వేణు గోపాల్ అన్నారు. మండల పరిధిలోని ఆయన మంగళవారం కొత్తగా ఏర్పాటు చేసిన ఆలుబాక, తిప్పాపురం, ముత్తారం పోలింగ్ కేంద్రాల్లో ఉన్న సౌకర్యాలు పరిశీలించారు. అనంతరం ఆలుబాక జిల్లా పరిషత్ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరుశాతం పెంచేలా ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సమ్మయ్య, ఎంపీడీఓ అడ్డూరి బాబు, డిప్యూటీ తహసీల్దార్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య భారతి సేవలు మరువలేనివి..



సుబ్రహ్మణ్య భారతి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఈఓ, తదితరులు

ములుగు: సుబ్రహ్మణ్య భారతి సేవలు మరువలేనివని డీఈఓ పాణిని అన్నారు. సుబ్రహ్మణ్య భారతి జయంతిని పురస్కరించుకుని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం భారతీయ దివాస్ మహోత్సవాన్ని విద్యాశాఖ తరఫున ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి ముఖ్య అతిథిగా హాజరై సుబ్రమణ్య భారతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ భాషలు నేర్చుకోవడానికి కృషి చేసిన సుబ్రహ్మణ్య భారతి జయంతిని పురస్కరించుకుని ప్రతిఏటా భారతీయ భాషా దివాస్‌ను నిర్వహించుకుంటున్నామని తెలిపారు. విద్యాశాఖ క్వాలిటీ కో ఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్రోద్యమ సమయంలో దేశభక్తిని చాటే విధంగా ఆయన బహుభాషలను ప్రోత్సహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్షం రాజు, సాంబయ్య, జిల్లా సైన్స్ అధికారి అప్పని జయదేవ్, డీసీఈబీ సహాయ కార్యదర్శి యాసం విక్రంరాజ్ యాదవ్, సిబ్బంది మనోహర్‌రావు, ఫిరోజ్, భరత్, ప్రవీణ్ పాల్గొన్నారు.

బొగ్గులవాగులో జలదీక్ష



బొగ్గులవాగులో జలదీక్ష చేస్తున్న నాయకులు

ములుగు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని 5 ఎకరాలకు పరిమితం చేయాలని, భూస్వాములకు వర్తింప చేయకూడదని రైతు సంఘం ఆధ్వర్యంలో మండల పరిధిలోని సర్వాపూర్ సమీపంలోని బొగ్గులవాగులో మంగళవారం ఆ సంఘం నాయకులు జలదీక్ష చేశారు. ఈ మేరకు రైతుసంఘం జిల్లా నాయకుడు గుండబోయిన రవిగౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రెండు లక్షల రుణమాఫీని వెంటనే అమలు చేయాలని కోరారు. భూమి ఉండి పట్టాలు లేని రైతులకు సైతం పట్టా పుస్తకాలు జారీ చేసి రైతుబంధు అందించాలని కోరారు. గ్రామసభలు నిర్వహించి అర్హులైన రైతులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిక్కినేని కొండల్‌రావు, తిరుపతి, శ్రీనివాస్, గుండమీది వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నిట్‌లో జియాన్ సదస్సు ప్రారంభం

కాజీపేట అర్బన్ : నిట్ సెమినార్ హాల్ కాంప్లెక్స్‌లోని ఖురానా హాల్‌లో మంగళవారం 10 రోజుల జియాన్ సదస్సు ప్రారంభమైంది. 'అడ్వాన్సెస్ ఫాన్ హైడ్రోలజిక్ మానిటరింగ్ ఆఫ్ వాటర్‌షెడ్స్' అంశంపై నిర్వహించిన సదస్సును యూఎస్‌ఏలోని కుక్‌వేలీ టెన్నెస్సీ టెక్నాలజికల్ యూనివర్సిటీ సివిల్ ప్రొఫెసర్ డాక్టర్ ఆల్ఫ్రెడ్ జె.కల్యాణపు ప్రారంభించారు. సదస్సులో నిట్ సివిల్ ప్రొఫెసర్, కోఆర్డినేటర్ వెంకటరెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తగ్గేదే లేదు..

ఉమ్మడి వరంగల్‌లో జోరుగా 'రియల్' వ్యాపారం..

- తగ్గని రిజిస్ట్రేషన్లు.. గతేడాదితో పోలిస్తే పెరిగిన ఆదాయం
- ఈ ఏడాది రూ.451.58 కోట్లకు చేరిన వైనం
- ఇప్పటికే 1,14,211 దస్తావేజుల రిజిస్ట్రేషన్..
- ఖజానాకు కాసులు కురిపించిన రిజిస్ట్రేషన్లు

మొత్తం రిజిస్ట్రేషన్ కార్యాలయాలు: 13
2022 నవంబర్ 30 నాటికి రిజిస్ట్రేషన్లు (దస్తావేజులు): 1,10,422
ప్రభుత్వానికి సమకూరిన ఆదాయం: రూ. 394.56 కోట్లు
2023 నవంబర్ 30 నాటికి రిజిస్ట్రేషన్లు (దస్తావేజులు): 1,14,211
ప్రభుత్వానికి సమకూరిన ఆదాయం: రూ.451.58 కోట్లు



రిజిస్ట్రార్ కార్యాలయంలో క్రయ విక్రయదారులు



హనుమకొండ రిజిస్ట్రార్ కార్యాలయం

సాక్షిప్రతినిధి, వరంగల్:

ఉమ్మడి వరంగల్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరు తగ్గడం లేదు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి కొంతముందుగా, అంటే చివరి రోజుల్లో ప్రభుత్వానికి స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా రాబడి రూ.120 కోట్ల నుంచి రూ.145 కోట్ల వరకు ఉండేది. గతేడాది నవంబర్ నాటికి రూ.394.56 కోట్లకు చేరింది. గ్రేటర్ వరంగల్ చుట్టూరా కాజీపేట, వరంగల్, హనుమకొండ, హసన్‌పర్తి, మడికొండ, మామునూరు, ధర్మసాగర్ తదితర ప్రాంతాల్లో విస్తరించిన రియల్ ఎస్టేట్ వ్యాపారం రిజిస్ట్రేషన్ల శాఖకు కాసుల వర్షం కురిపిస్తోంది. వరంగల్, జేఎస్ భూపాలపల్లి, ములుగు, జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లోనూ రియల్ ఎస్టేట్ వ్యాపారం, భూముల క్రయవిక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఫలితంగా ఒకప్పుడు సగటున నెలకు రెండు వేల నుంచి ఐదు వేల వరకు అయ్యే రిజిస్ట్రేషన్లు.. ఇప్పుడు 10,365 వరకు దస్తావేజులు రిజిస్ట్రేషన్ అవుతున్నాయి.

రిజిస్ట్రేషన్ల జోరు.. పెరిగిన ఆదాయం....

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 2023లో రిజిస్ట్రేషన్ల జోరు కొనసాగింది. ఈ ఏడాది నవంబర్ నాటికి 1,14,211 దస్తావేజుల రిజిస్ట్రేషన్లు పూర్తి కాగా, ఆ శాఖ ద్వారా ప్రభుత్వానికి రూ.451.58 కోట్ల ఆదాయం సమకూరింది. కాగా గతేడాది నవంబర్ నాటికి 1,10,422 దస్తావేజుల రిజిస్ట్రేషన్లకు గాను రూ.394.56 కోట్ల ఆదాయం ఖజానాకు చేరింది. ఈ ఏడాది నవంబర్ 2023 నాటికి గతేడాది కంటే రూ.57.02 కోట్ల అధిక ఆదాయం అందజేసింది. రాష్ట్రంలో హైదరాబాద్‌కు దీటుగా రియల్ ఎస్టేట్ రంగం పుంజుకోవడంతో రెండో రాజధానిగా గుర్తింపు పొందిన ఓరుగల్లు నగరం ఖజానాకు ఆదాయం అందించడంలోనూ పోటీ పడుతోంది.

వరంగల్ తర్వాత జనగామ, మహబూబాబాద్‌లలో అత్యధికం...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చూస్తే గతేడాది, ఈ ఏడాది కూడా వరంగల్ తర్వాత జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లో అత్యధికంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం, రిజిస్ట్రేషన్లు జరిగినట్లు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ రికార్డులు చెబుతున్నాయి.

- 2022లో వరంగల్ ఆర్ఓ పరిధిలో అత్యధికంగా 34,395 దస్తావేజులు రిజిస్ట్రేషన్ కాగా భూముల ధర ఎక్కువగా ఉండడంతో రూ.209.16 కోట్ల ఆదాయం వచ్చింది. ఆ తర్వాత మహబూబాబాద్‌లో 16,628లతో రూ.39.93 కోట్లు, జనగామలో 12,245లతో రూ.30.49 కోట్లు, ఖిలా వరంగల్ పరిధిలో 12,194 దస్తావేజులతో రూ.46.31 కోట్ల ఆదాయం సమకూరింది. మిగతా రిజిస్ట్రేషన్ కార్యాలయాల పరిధిలోనూ రిజిస్ట్రేషన్లు సాగినా.. వ్యవసాయేతరతోపాటు వ్యవసాయానుబంధ రిజిస్ట్రేషన్లు సాగాయి.
- 2023 నవంబర్ 30 వరకు మొత్తం 13 రిజిస్ట్రేషన్ కార్యాలయాల పరిధిలో 1,14,211 దస్తావేజులు రిజిస్ట్రేషన్ కాగా, అత్యధికంగా వరంగల్ ఆర్వో, జనగామ, మహబూబాబాద్‌లోనే జరిగాయి. వరంగల్ ఆర్వో పరిధిలో 32,312 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ కాగా రూ.221.88 కోట్ల ఆదాయం వచ్చింది. ఇక్కడ గతేడాదితో పోలిస్తే దస్తావేజుల సంఖ్య తగ్గినా ఆదాయం పెరిగింది. ఆ తర్వాత డాక్యుమెంట్ల సంఖ్య మహబూబాబాద్‌లో 17,209లు కాగా, ఆదాయం రూ.39.99 కోట్లు, జనగామలో 13,834లకు రూ.30.29 కోట్లు వచ్చింది. అత్యల్పంగా కొడకండ్లలో 1,673 డాక్యుమెంట్లు కాగా, రూ.2.96 కోట్లు ఆదాయం వచ్చింది.

రియల్ భూమ్‌తోనే అధిక రిజిస్ట్రేషన్లు.. ఆదాయం

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా రియల్‌భూం పుంజుకోవడంతోనే గతేడాది కంటే అధికంగా రిజిస్ట్రేషన్లు సాగాయి. తద్వారా ప్రభుత్వానికి ఆదాయం లభించింది. ప్రతి దస్తావేజును పరిశీలించి, రిజిస్ట్రేషన్ పూర్తి చేసి మ్యుటేషన్ ప్రక్రియను సైతం పూర్తిచేస్తున్నాం. భూక్రయవిక్రయదారులు స్వయంగా తామే దస్తావేజులను తయారు చేసుకుని కార్యాలయానికి వస్తే త్వరితగతిన రిజిస్ట్రేషన్లు పూర్తయ్యే అవకాశం ఉంటుంది.
– హరికోట్ల రవి, జిల్లా రిజిస్ట్రార్, వరంగల్

చట్టాలపై అవగాహన తప్పనిసరి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ రమణ

వెంకటాపురం(కె): బాలికలు చట్టాలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని సఖి లీగల్ కౌన్సిలర్ ప్రణయ్ ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాల విద్యార్థులకు మంగళవారం బాలికల హక్కులు, చట్టాలపై అవగాహన సదస్సును చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల హక్కులు, పోక్సో చట్టాలపై వివరించారు. టోల్ ఫ్రీ నంబర్ 181పై అవగాహన కల్పించారు. అనంతరం వెంకటాపురం జెడ్పీటీసీ పాయం రమణ చేతుల మీదుగా సఖి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చేయూత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు చిడెం సాయి ప్రకాశ్, హెచ్ఎం సునీత, కల్పనా, మౌనిక పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి


అజయ్ (ఫైల్)

హసన్‌పర్తి: ఈతకు వెళ్లి ఓ విద్యార్థి మృతిచెందాడు. ఈ ఘటన కేయూ పీఎస్ పరిధిలోని భీమారంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం భూపాలపల్లి జిల్లా కాటారం మండలం పరికిపల్లికి చెందిన గురుగాం అజయ్(17) నగరంలోని ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. రామారంలోని ఓ ప్రైవేట్ హాస్టల్ ఉంటూ రాకపోకలు సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం స్నేహితులతో కలిసి భీమారం చెరువులో ఈతకు వెళ్లాడు. ఈత కొడుతూ పిచ్చి మొక్కలకు చిక్కి మృతి చెందాడు. సోమవారం రాత్రి మృతదేహం లభ్యమైంది. ఈ ఘటనపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

చోరీ కేసులో నేరస్తుడికి జైలు

వరంగల్ లీగల్ : తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడిన కేసులో నేరస్తుడికి రెండు సంవత్సరాల 9 నెలల జైలు శిక్ష విధిస్తూ హనుమకొండ జిల్లా మూడో మున్సిఫ్ కోర్టు జడ్జి సిరిసిల్ల ప్రియాంక మంగళవారం తీర్పు వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండ బాలసముద్రానికి చెందిన ఎం. సందీప్‌రావు 2020 డిసెంబర్ 12న తన ఇంటికి తాళం వేసి కుటుంబ సమేతంగా జగిత్యాలకు వెళ్లారు. ఐదురోజుల అనంతరం తిరిగి ఇంటికి రాగా అప్పటికే ప్రధాన దర్వాజ తలుపులు ధ్వంసం చేసి తాళాలు తొలగించి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని బంగారం, వెండి, డైమాండ్స్, ఇతర సామగ్రి మొత్తం రూ.7లక్షల విలువైన వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈవిషయాన్ని సుబేదారి పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు చేరుకుని వివరాలు సేకరించి డిసెంబర్ 17న కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో హైదరాబాద్ బోడుప్పల్‌కు చెందిన ఎండీ సద్దాం అలీ దొంగగా తేలడంతో అతడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చారు. విచారణలో సాక్ష్యాధారాలు పరిశీలించిన కోర్టు నేరం రుజువు కావడంతో సద్దాం అలీకి రెండు సంవత్సరాల 9నెలల జైలు శిక్ష విధిస్తూ జడ్జి ప్రియాంక తీర్పు వెల్లడించారు. ఈకేసును పోలీసులు నరేష్‌కుమార్, రఘువేందర్ పరిశోధించగా ప్రస్తుత ఇన్‌స్పెక్టర్ షుకూర్ పర్యవేక్షణలో లైజన్ ఆఫీసర్ వెంకటస్వామి, కానిస్టేబుల్ యాదయ్య, సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టారు. ప్రాసిక్యూషన్ పక్షాన పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎ. కృష్ణవేణి కేసు వాదించారు.

'పాడి'.. పరిఢవిల్లాలంటే..

పునరుత్పత్తి కీలకం

- ఏడాదికొక దూడ జన్మిస్తేనే లాభం
- వ్యాధులు రాకుండా చూడాలి
- రైతులకు శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు





కరీమాబాద్: పాలు, పెరుగు.. సంపూర్ణ ఆహారం. మానవుడి రోజువారీ ఆహారంలో ఈ రెండు తప్పకుండా ఉండాల్సిందే. లేని పక్షంలో ఎంత భుజించినా అసంపూర్ణమే. ఏదో వెలితిగా ఉంటుంది. భోజనం, టీ, ఇతర తీపి పదార్థాల తయారీలో పాలు, పెరుగు కచ్చితంగా ఉండాల్సిందే. దీంతో రోజురోజుకూ వీటి వినియోగం విరివిగా పెరుగుతున్న నేపథ్యంలో పాడి పరిశ్రమ ఏర్పాటుకు రైతులు ముందుకు వస్తున్నారు. అయితే పాడిపరిశ్రమ మనుగడ సాధించి నిర్వాహకులు ఆర్థికాభివృద్ధి బాటలో పయనించాలంటే పశువుల 'పునరుత్పత్తి' శక్తి కీలకం. ప్రతీ ఏడాదికోసారి పశువులు దూడలకు జన్మనిస్తే రైతులకు లాభదాయకంగా ఉంటుంది. అయితే పశువులకు వ్యాధులు సోకి చూడి పశువులు ఈసుకుపోవడమే కాకుండా ఇతర పునరుత్పత్తి సమస్యలు ఏర్పడడం మూలంగా 'చూడి' నిలవడం కష్టంగా మారుతున్న నేపథ్యంలో పాడి పరిశ్రమ నిర్వాహకులు పశుపోషకాలపై అవగాహన కలిగి ఉండాలని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పశువుల ఎదుగుదల, వాటిలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనించాలని సూచిస్తున్నారు. పశువుల్లో వచ్చే వ్యాధులు, వాటి నివారణ చర్యలు గురించి శాస్త్రవేత్తలు పలు సలహాలు, సూచనలు అందజేస్తున్నారు.

కాంపైలోబాక్టీరియోసిస్..

కాంపైలోబాక్టీరియోసిస్ అనే వ్యాధి 'కాంపైలోబాక్టర్‌ఫీటస్' అనే సూక్ష్మజీవి మూలంగా వస్తుంది. దున్నల వీర్యంలో ఉండే ఈ బాక్టీరియా అవి ఆడ పశువులను దాటినప్పుడు వాటికి వ్యాప్తి చెందుతుంది. చూడి కట్టిన 2-3 నెలల మధ్యలో ఆవు ఈసుకుపోయి మళ్లీ ఎద లక్షణాలు కనిపిస్తాయి. అందుకే దున్నలను ఎప్పటికప్పుడు పరీక్షిస్తూ వ్యాధి నిర్ధారణ అయిన పశువులకు వైద్యుడి సలహా మేరకు క్లిండమైసిన్, టేట్రాసైక్లిన్ వంటి మందులు వాడడంతోపాటు ఆవులు, గేదెలకు కృత్రిమ గర్భధారణ చేయించాలి.

బ్రూసెల్లోసిస్..

బ్రూసెల్లోసిస్ అనే వ్యాధి 'బ్రూసెల్లా అబార్టస్' అను సూక్ష్మజీవి వల్ల వస్తుంది. చూడి ఆవులు ఎక్కువ సంఖ్యలో ఉన్న మందలో ఈ వ్యాధి త్వరగా వ్యాపిస్తుంది. వ్యాధి సోకిన పశువులు 5 నుంచి 6వ నెల మధ్యలో ఈసుకుపోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది. గర్భస్రావం జరిగిన వెంటనే చనిపోయిన దూడ, మాయ, గర్భస్రావాలు, మలమూత్రాలు, మిగిలిన మేత, నీరు తీసివేసి షెడ్లను శుభ్రం చేయాలి. ఈసుకుపోయిన పశువు రక్తన మూనాలను దగ్గరలో ఉన్న పశు పరిశోధనశాలలో పరీక్షించాలి. వ్యాధి నిర్ధారణ జరిగితే గర్భస్రావమైన పశువులను శాశ్వతంగా మంద నుంచి వేరుచేయాలి. ఈ వ్యాధి ఎక్కువగా ఉన్న డెయిరీ ఫామ్‌లలో బ్రూసెల్లాస్ట్రెయిన్-19 టీకాలు ఆడ దూడలకు 5 నుంచి 6 నెలల మధ్యలో వేయించాలి.

క్లమీడియా..

జీవాల్లో 'క్లమీడియా అబార్టస్' అనే సూక్ష్మజీవి ఎన్‌జూటిక్ అబార్షన్‌ను కలుగజేస్తుంది. ఆరోగ్యవంత పశువులు, వ్యాధిగ్రస్త జీవాలను అతి సమీపంలో ఉంచినప్పుడు పశువులకు ఈ వ్యాధి సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.

కాక్సియెల్లాబర్నెట్లి..

ఈ రికెట్సియా సూక్ష్మజీవి పశువుల జననేంద్రియాల్లో నివసిస్తూ వృద్ధి చెందుతుంది. చూడి పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి బాగా తగ్గినప్పుడు ఈ సూక్ష్మజీవులు వృద్ధి చెంది గర్భాన్ని ఆశిస్తాయి. దీంతో పశువులు ఈసుకుపోయే ప్రమాదం ఉంటుంది. వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరు చేయడమే కాకుండా అవి వదిలేసిన గడ్డి, నీరును వేరే పశువులకు పెట్టొద్దు. టెట్రాసైక్లిన్ మందును 3 నుంచి 4 వారాల పాటు పౌడర్ రూపంలో పశువులకు తాగించాలి. డాక్సిసైక్లిన్ 3 నుంచి 4 వారాల పాటు పశువులకు వాడించాలి.

శిలీంద్రియాలు...

ఆస్పరిజిల్లాస్, మ్యూకార్, రైజోపస్, అబ్సిడియా అనే శిలీంద్ర జీవులు ముక్కిన పాతగడ్డిలో వృద్ధి చెందుతాయి. ఆ గడ్డిని చూడి పశువులకు మేపడం మూలంగా చూడి చివరి దశలో గర్భస్రావం జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

లెప్టోస్పైరోసిస్..

కుంటలు, చెరువులు, తేమగల ప్రాంతాల్లో 'లెప్టోస్పైరా' అనే సూక్ష్మజీవులు ఆవాసం ఏర్పాటు చేసుకుంటాయి. ఆయా ప్రదేశాలలో పశువులను మేపడం మూలంగా ఈ వ్యాధి సోకుతుంది. పాడి పశువులతోపాటు గొర్రెలు, మేకలు, మనుషులకు కూడా ఈ వ్యాధి విస్తరిస్తుంది. పశువుల మూత్రనాళాల్లో ఈ సూక్ష్మజీవి వృద్ధి చెందుతూ మిగతా పశువులకు కూడా సంక్రమిస్తుంది. చూడి పశువులకు ఈ వ్యాధి సోకేతే గర్భస్రావం జరిగి చనిపోయిన దూడలు జన్మిస్తాయి. వ్యాధి నివారణకు డాక్సీసైక్లిన్, పెన్సిలిన్ వంటి యాంటీ బయోటిక్ మందులను 5 నుంచి 7 రోజుల వరకు వాడించాలి. పందికొక్కులు, ఎలుకలు లేకుండా చూడాలి.

పశువుల్లో ముందస్తు వ్యాధి నివారణ చర్యలు చేపట్టాలి



పశువులకు వ్యాధి సోకిన తర్వాత చికిత్స ఖర్చుతో కూడుకుంది. అందుకే ముందస్తు నివారణ చర్యలు తీసుకోవాలి. పాకలు శుభ్రంగా ఉంచుకోవడంతోపాటు పశువులను ఉంచే ప్రదేశంలో నీరు నిలవకుండా, ఈగలు, దోమలు చేరకుండా చూసుకోవాలి. వ్యాధి నిరోధక టీకాలు షెడ్యూల్ ప్రకారం వేయించాలి. ఎదతో ఉన్న పశువులను దున్నతో కాకుండా కృత్రిమ గర్భధారణ చేయించడం మూలంగా దున్నపోతు ద్వారా సంక్రమించే వ్యాధులను నివారించొచ్చు.

– డాక్టర్ జె.శశాంక్, శాస్త్రవేత్త, కేవీకే మామునూరు

ఇన్ఫెక్షన్ బొవైస్ రైనోట్రైకెటీస్..

ఈ వ్యాధి 'హెర్పస్' అనే అతి సూక్ష్మజీవి వల్ల సంభవిస్తుంది. వ్యాధి సోకిన ఆవులు తీవ్ర జ్వరంతో బాధపడుతాయి. దీనితోపాటు కళ్లు, ముక్కు నుంచి స్రావాలు, కండ్ల కలకలు, నోటి నుంచి చొంగ కారడం, దగ్గు కనిపిస్తాయి. చూడి ఆవులకు ఈ వ్యాధి సోకితే 4 నుంచి 7 నెలల మధ్యలో గర్భస్రావం జరుగుతుంది. వ్యాధి నిర్ధారణ అయిన పశువులకు ఇంటాసేఫ్ లాంటి బ్రాడ్‌స్పెక్ట్రమ్ యాంటీబయోటిక్స్ వాడించాలి. గ్లూకోజ్, ఎలక్ట్రోలైట్ ద్రావణాలను పశువులకు తాగించాలి.

రేషన్ బియ్యం పట్టివేత..

- ముగ్గురిపై కేసు నమోదు


రేషన్ బియ్యం చూపుతున్న ఎస్సై రమేష్‌బాబు

దంతాలపల్లి: ప్రజల వద్ద నుంచి అక్రమంగా కొనుగోలు చేస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఏపీలోని అనంతపురం జిల్లా కేంద్రానికి చెందిన పోతరాజు రమేష్, మన్నెపుల శ్రీకాంత్, ఎరుకల రామన్న మంగళవారం దంతాలపల్లి మండలంలోని బొడ్లాడలో ప్రజల వద్ద నుంచి అక్రమంగా రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న ఎస్సై రమేష్‌బాబు సిబ్బందితో కలిసి వాహనాన్ని తనిఖీ చేశారు. ఇందులో రేషన్ బియ్యం లభించడంతో వాహనం స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది ప్రకాష్‌రెడ్డి, వెంకన్న, గణేష్, వెంకటయ్య పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో వాహనం దగ్ధం


దగ్ధమైన వాహనం

చిల్పూరు: షార్ట్‌సర్క్యూట్‌తో టాటా ఏస్ వాహనం దగ్ధమైంది. ఈ ఘటన చిల్పూరు మండలం వంగాలపల్లి బస్‌స్టేజీ సమీపంలో జరిగింది. డ్రైవర్ మల్లయ్య, ఏఎస్సై జయకుమార్ కథనం ప్రకారం హనుమకొండ నుంచి జఫర్‌గఢ్ మండలానికి రోజూ ఆరుగురు టీచర్లు ఈ వాహనంలో పాఠశాలకు హాజరవుతారు. రోజు మాదిరిగానే ఉదయం బయలు దేరారు. వాహనం వంగాలపల్లి సమీపంలోకి రాగానే వైర్లు కాలిన వాసన వచ్చింది. దీంతో డ్రైవర్ వాహన వేగం తగ్గించాడు. అదే సమయంలో పొగలు వస్తుండడంతో వెంటనే అందులో ఉన్న టీచర్లను దింపాడు. అనంతరం కొద్ది దూరం వెళ్లి డ్రైవర్ దిగగానే ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో చుట్టు పక్కల వారు నీళ్లు పోశారు. మంటలు అదుపులోకి వచ్చినా అప్పటికే వాహనం పూర్తిగా దగ్ధమైంది. కాగా, వాసన రావడంతో వాహనం ఆపగా తాము దిగి ప్రాణాపాయం నుంచి బయట పడ్డామని టీచర్లు తెలిపారు.

కాపర్ తీగల చోరీ


దుండగులు ధ్వంసం చేసిన విద్యుత్ మోటార్

డోర్నకల్: సీరోలు మండలం మన్నెగూడెం గ్రామ సమీపంలో నలుగురు రైతులకు చెందిన విద్యుత్ మోటార్లను సోమవారం అర్ధరాత్రి దుండగులు ధ్వంసం చేసి కాపర్ తీగలు ఎత్తుకెళ్లారు. మన్నెగూడేనికి చెందిన గుగులోత్ భాస్కర్, ఊరు గొండ వెంకన్న, గుగులోత్ కిషన్, రావిగూడేనికి చెందిన భూక్యా వీరన్న తమ వ్యవసాయ భూముల్లో మిరప, వరి పంటలు సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో వ్యవసాయ బావులకు అమర్చిన విద్యుత్ మోటార్లను దుండగులు ధ్వంసం చేసి కాపర్ తీగలు, సీటర్లను చోరీ చేశారు. చోరీకి గురైన సీటర్‌లో సుమారు 5 కేజీల కాపర్ తీగ ఉంటుందని, దీని విలువ సుమారు రూ. 3 వేలు, ఇనుప సీటర్ బరువు సుమారు 20 కేజీల వరకు ఉంటుందని రైతులు తెలిపారు.

పత్తిచేనులోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

- పలువురికి గాయాలు


పత్తిచేనులోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

దామెర: ఆర్టీసీ బస్సు అదుపుతప్పి పత్తి చేనులోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన హనుమకొండ జిల్లా దామెర మండలం ఒగ్లాపూర్ సమీపంలోని పవర్‌గ్రిడ్ వద్ద హైదరాబాద్-భూపాలపట్నం జాతీయరహదారిపై మంగళవారం చోటుచేసుకుంది. ఏఎస్సై సిద్దయ్య, ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ ఆర్టీసీ-2 డిపోనకు చెందిన బస్సు మంగళవారం ఉదయం హనుమకొండ నుంచి ఏటూరునాగారం వైపునకు వెళ్తోంది. ఒగ్లాపూర్ సమీపంలోని పవర్‌గ్రిడ్ వద్దకు రాగానే ఒక్కసారిగా బస్సు అదుపుతప్పి జాతీయ రహరి పక్కనే ఉన్న పత్తిచేనులోకి దూసుకెళ్లింది. దీంతో బస్సు కుదుపులకు ప్రయాణికులు ఆందోళనకు గురికావడంతో పాటు పలువురికి గాయాలయ్యాయి. దీంతో వెంటనే స్థానికులు స్పందించి బస్సు ప్రధాన ద్వారం, ఎమర్జెన్సీ ఎగ్జిట్‌తోపాటు వెనుక అద్దం తొలగించి ప్రయాణికులను బయటికి తీసుకువచ్చారు. ప్రయాణికులు రామక పుష్పాంజలి, పత్తి వినయ్ కుమార్, అలుపరాజు సంధ్య, సురేఖ, స్వర్ణలకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో ఎస్‌ఎస్‌ఆర్ అపోలో ఆస్పత్రికి కొందరిని, ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో 68 మంది ప్రయాణికులు బస్సులో ఉండగా డ్రైవర్ అతివేగం, అజాగ్రత్తతోనే ప్రమాదం జరిగిందని ప్రయాణికులు ఆరోపించారు. చికిత్స పొందుతున్న వారిని డిపో అసిస్టెంట్ మేనేజర్ జ్యోత్స్న, సీఐ మల్లేష్ పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా గాయపడిన రామక పుష్పాంజలి భర్త సయ్యద్ అష్రద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

శాఖల వారీగా వివరాలు అందజేయాలి

- ఐటీడీఏ పీఓ అంకిత్
- మేడారం జాతర ఏర్పాట్లపై సమీక్ష


జాతరలో చేపట్టనున్న ఏర్పాట్లను పరిశీలిస్తున్న పీఓ

ఎస్ఎస్‌తాడ్వాయి : మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతర ఏర్పాట్లపై అధికారుల చర్యలు వేగవంతమవుతున్నాయి. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క ఈ నెల 11వ తేదీన జాతర ఏర్పాట్లపై గిరిజన సంక్షేమశాఖ అధికారులతో సమీక్షించి ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో మంగళవారం మేడారంలోని ఐటీడీఏ అతిథిగృహంలో జాతర ఏర్పాట్లపై గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్, గిరిజన సంక్షేమం, ఎండోమెంట్, నీటిపారుదల శాఖల అధికారులతో ఐటీడీఏ పీఓ అంకిత్ సమీక్షించారు. అందుబాటులో ఉన్న శాశ్వత, కొత్త పనులు ప్రతిపాదించడం, జాతర సమయంలో ఉపయోగించేందుకు సంబంధిత శాఖల వద్ద మెటీరియల్ లభ్యతపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా పీఓ మాట్లాడుతూ వచ్చే వారం మంత్రి సీతక్క.. జాతరపై వివిధ శాఖల వారీగా సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. శాఖల వారీగా వివరాలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి మేడారంలో చేపట్టనున్న ఏర్పాట్లపై క్షేత్ర స్థాయిలో పర్యటించారు. ఐటీడీఏ వెనుక వైపు, చిలుకలగుట్ట, జంపన్నవాగు ఏరియా, ఆర్టీసీ బస్టాండ్ ఏరియాలో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రస్తుతం కొనసాగుతున్న పనులను పరిశీలించారు. మిషన్ భగీరథ ఎస్ఈ మల్లేశ్, ఏపీ సంవతరావు, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ హేమలత, ఇంట్రా(ఆర్‌డబ్ల్యూఎస్) ఈఈ సుభాష్, ట్రాన్స్‌కో డీఈ పులుసం నాగేశ్వర్‌రావు, ఎండోమెంట్ ఈఓ రాజేంద్రం, ఐటీడీఏ ఎస్‌ఓ సతీష్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సతీష్, ఇరిగేషన్ డీఈ సదయ్య పాల్గొన్నారు.

దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి

- కేయూ వీసీ తాటికొండ రమేష్


మాట్లాడుతున్న వీసీ రమేష్

కేయూ క్యాంపస్: దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య తాటికొండ రమేష్ అన్నారు. మంగళవారం యూనివర్సిటీలోని దివ్యాంగుల సెల్ ఆధ్వర్యంలో క్యాంపస్‌లోని సెనేట్‌హాల్‌లో నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మన బలంపై మనకు నమ్మకం, విశ్వాసం ఉండాలన్నారు. అప్పుడే అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకోగలుగుతామన్నారు. జయాపజయాలు మన సంకల్పాన్ని బట్టే ఉంటాయన్నారు.స్టీఫెన్ హాకిన్స్, బాలాలత, ఆచార్య కె నాగేశ్వర్‌ను గుర్తుచేశారు. అనంతరం హంగేరి దేశానికి చెందిన బయాలజికల్ రీసెర్చ్‌సెంటర్ ప్రొఫెసర్ లాసజోల్ సజ్బదోస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమస్యలపైకాకుండా పరిష్కారాలపై దృష్టిసారించాలన్నారు. వరంగల్ నిట్ ప్రొఫెసర్ పోరిక రామ్‌లాల్ మాట్లాడుతూ అంగవైకల్యం లక్ష్య సాధనకు అడ్డుకాదన్నారు. కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ ఆచార్య టి శ్రీనివాస్‌రావు, దివ్యాంగుల సెల్ డైరెక్టర్ డాక్టర్ ఎ రాజు, యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య బి సురేష్‌లాల్, దివ్యాంగుల సంఘం విశ్వవిద్యాలయ అధ్యక్షుడు సాంబశివరావు, లా కాలేజీ ప్రొఫెసర్ శ్రీనివాస్, అడ్జెంట్ ప్రొఫెసర్లు ఎస్ రామస్వామి, ఎ సదానందం, కృష్ణమాచార్య తదితరులు పాల్గొన్నారు. డాక్టరేట్‌లు పొందినపలువురిని అతిథులు సన్మానించారు.

పరిశోధకులకు ప్రోత్సాహం..

- ప్రొఫెసర్ లాసజోల్ సజ్బదోస్


విద్యార్థులు, అధ్యాపకులతో హంగేరి ఆచార్యుడు లాసజోల్‌సజ్బదోస్

కేయూ క్యాంపస్: పరిశోధనలపరంగా పరిశోధకులను ప్రోత్సహిస్తామని హంగేరి దేశంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ బయోటెక్నాలజీ ,బయాలజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ గ్రూప్ లీడర్ ప్రొఫెసర్ లాసజోల్ సజ్బదోస్ అన్నారు. మంగళవారం కేయూలోని బయోటెక్నాలజీ విభాగాన్ని సందర్శించి విద్యార్థులు, అధ్యాపకులతో మాట్లాడారు. బొటానికల్ రంగంలో వస్తున్న మార్పులు, అవకాశాలను కొలబరేషన్‌తో ఉన్న ఉపయోగాల గురించి వివరించారు. హంగేరిలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ బయోలాజికల్ రీసెర్చ్‌సెంటర్ గ్రూప్ లీడర్‌గా కేయూను సందర్శించినట్లు తెలిపారు. తన పర్యవేక్షణలో బయోటెక్నాలజీ విభాగం రామకృష్ణ పీహెచ్‌డీ కోసం, డాక్టర్ శ్రీనివాస్ పీడీఎఫ్ గైడ్‌షిప్ కూడా చేస్తున్నట్లు లాసజోల్‌సజ్బదోస్ పేర్కొన్నారు. అడ్జెంట్ ఆచార్యుడు ఎ సదానందం, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శాస్త్రితో ఉన్న అవగాహన ఒప్పందంలోభాగంగా ఆయన ఇక్కడికి వచ్చారు. అనంతరం లాసజోల్‌సజ్బదోస్‌ను వీసీ రమేష్, రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు సన్మానించారు.

17 నుంచి అంతర్ పాఠశాలల క్రికెట్

- వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్ కన్వీనర్ నారాయణరెడ్డి


మాట్లాడుతున్న నారాయణరెడ్డి

హన్మకొండ: జనవరి 17 నుంచి 24 వ తేదీ వరకు ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అంతర్ పాఠశాలల (అండర్-16) బాలుర క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు హనుమకొండ వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్ కన్వీనర్ ఎస్ నారాయణరెడ్డి తెలిపారు. హనుమకొండలోని సెయింట్ పీటర్స్ హైస్కూల్‌లో మంగళవారం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, సీబీఎస్ఈ పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ మొదటిసారి వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాఠశాల స్థాయిలో క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నామన్నారు. జనవరి 3 నుంచి 5వ తేదీ వరకు సెయింట్ పీటర్స్ స్కూల్‌లో క్రీడాకారుల నుంచి ఎంట్రీలు స్వీకరించనున్నట్లు తెలిపారు. సమావేశంలో హెచ్‌వీసీ అసోసియేషన్ అధ్యక్షుడు ఇ కోదండపాణి, వరంగల్ క్రికెట్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి ఎం ఉదయభానురావు, సీనియర్ క్రికెట్ క్రీడాకారులు మట్టెడ కుమార్, యాకూబ్ షరీఫ్, సిరాజ్, అస్లాం, చైతన్య, వీరేందర్ పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ..

- 11 తులాల బంగారం, కిలో వెండి, బైక్ అపహరణ
- మానుకోట పట్టణంలో ఘటన


తెరచి ఉన్న బీరువా

మహబూబాబాద్ రూరల్ : తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన మహబూబాబాద్ పట్టణంలోని ఫాతిమా హైస్కూల్ ఎదుట జరిగింది. బాధితుడి కథనం ప్రకారం.. హైస్కూల్ ఎదుట నివాసం ఉండే బండి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు గత నెల 29వ తేదీ ఖమ్మం జిల్లా కల్లూరుకు వెళ్లారు. తిరిగి ఈ నెల 10వ తేదీన రాత్రి మహబూబాబాద్ వచ్చారు. అప్పటికే వారి ఇంటి తలుపు తాళం పగులగొట్టి ఉంది. అనుమానం వచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. అందులోని పదకొండు తులాల బంగారం, కిలో వెండి కనిపించలేదు. అలాగే ఇంటి ఆవరణలో పార్క్ చేసిన పల్సర్ బైక్ కూడా కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని గ్రహించిన నాగేశ్వరరావు.. వెంటనే పోలీసులకు తెలుపగా టౌన్ ఎస్సై రామారావు, క్లూస్ టీం ఘటనా స్థలిని సందర్శించి వివరాలు సేకరించింది. అనంతనం ఈఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నామని టౌన్ సీఐ సతీష్ మంగళవారం తెలిపారు.

ప్రజాభిప్రాయం గౌరవించాలి


మాట్లాడుతున్న ప్రొఫెసర్ వెంకటనారాయణ

- తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ వెంకట నారాయణ

హన్మకొండ: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు నెలల్లో కూలిపోతుందని, తర్వాత మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని, ఇంకా రకరకాలుగా మాట్లాడడం మూర్ఖత్వమని తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ అన్నారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని కూరపాటి వెంకటనారాయణ నివాసంలో తెలంగాణ ఉద్యమకారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నూతన ప్రభుత్వ ఏర్పాటు, ఉద్యమ ఆకాంక్షలు, ప్రభుత్వముందున్న లక్ష్యాలు, గత ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై చర్చించారు. ఈ సందర్భంగా వెంకటనారాయణ మాట్లాడుతూ ప్రజాభిప్రాయాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. అలా కాకుండా ప్రజల మద్దతుతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాన్ని కూల్చుతామనడం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీలను నెరవేర్చాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి సూచించారు. ఉద్యమ ఆకాంక్షలు అమలుకు, మేనిఫెస్టో హామీల అమలుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పది సంవత్సరాలుగా నిరంకుశ పాలన కొనసాగిందని విమర్శించారు. తెలంగాణ ఉద్యమకారులు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారని, ప్రజల ఆకాంక్షలు బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ధ్వజమెత్తారు. నూతన ప్రభుత్వం ఏర్పాటులో ఉమ్మడి వరంగల్ జిల్లాది కీలక పాత్ర అన్నారు. ప్రజలు 10 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి ప్రజాప్రభుత్వ ఏర్పాటులో భాగస్వాములయ్యారన్నారు. ప్రజాప్రభుత్వంలో ఇద్దరు మహిళకు మంత్రులుగా చోటు లభించిందన్నారు. సమ్మక్క, సారలమ్మ వారసులుగా మంత్రులు కొండా సురేఖ, సీతక్క ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సమావేశంలో నాయకులు సోమ రామ్మూర్తి, పుల్లూరి సుధాకర్, రాచకొండ ప్రవీణ్, చింతకింది కుమారస్వామి, లింగారెడ్డి, పాపిరెడ్డి, శ్రీనివాస్, డాక్టర్. కె వీరాస్వామి, డాక్టర్. ఎం. వీరాస్వామి, కుమార్ పాల్గొన్నారు.